భూమికి మేలు.. పచ్చిరొట్ట

తక్కువ సారవంతమైన భూముల్లో నల్లటి మట్టిని వేస్తే మంచి దిగుబడులు వస్తాయి. అయితే ఇది అత్యంత ఖర్చుతో కూడుకున్నది. మట్టిని వేసే బదులు నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట ఎరువుల సాయంతో భూమిని సారవంతంగా మార్చుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జీలుగ సాగు చక్కటి ఫలితాలను ఇస్తోందని అంటున్నారు. జనుము, జీలుగ పైర్లను పువ్వు మొగ్గ దశ వరకు పెంచి భూమిలో కలియ దున్నడాన్ని పచ్చి రొట్ట ఎరువుగా పరిగణిస్తారు.

–వడమాలపేట (విజయపురం)

- అధిక పోషకాలు సమకూరి భూమి సారవంతం
- రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది
- పెట్టుబడి తగ్గి పెరగనున్న దిగుబడి
- సబ్సిడీపై రైతులకు అందుబాటులో విత్తనాలు



పచ్చిరొట్టగా సాగవుతున్న జనుము

పశువుల పేడ కంటే పచ్చిరొట్ట భూమిని పది రెట్లు ఎక్కువ సారవంతం చేస్తుంది. పచ్చిరొట్ట విత్తనాల కింద జీలుగ, జనుము, పిల్లిపెసర ద్వారా భూసారం పెంచుకునేందుకు వీలుగా పొలాల్లో చల్లి పూతకు వచ్చిన తర్వాత కలియదున్నితే సేంద్రియ పదార్థం బాగా పెరుగుతుంది. ఇటీవల ఈ విత్తనాలకు రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో వీటి ధరలు, రాయితీలు ఖరారు చేశారు.

220 క్వింటాళ్లు

మండలంలో ఈ ఏడాది 120 క్వింటాళ్ల జీలుగ, 100 క్వింటాళ్ల జనుము రైతులకు ఇవ్వనున్నారు. అలాగే గత ఏడాది ఖరీఫ్‌లో కూడా జనుము, జీలుగ విత్తనాలు 220 క్వింటాళ్లు కేటాయించారు. జీలుగ విత్తనాలు క్వింటాల్ పూర్తి ధర రూ.12,300 కాగా, 50 శాతం రాయితీతో రూ.6,150 చొప్పున రైతులకు అందజేయనున్నారు. అలాగే క్వింటాలు జనుము విత్తనాల పూర్తి ధర రూ.10,900 కాగా, 50 శాతం రాయితీ పోను రూ.5,450లకు రైతులకు అందించనున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు పచ్చిరొట్ట సాగుపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

లాభాలు

- పొలంలో జీలుగను కలియదున్నితే భూసారం పెరుగుతుంది.
- మొక్కలకు రెండు శాతం నత్రజని, సూపర్ ఫాస్ఫేట్ అదనంగా అందుతుంది.
- జింక్ మాంగనీస్, ఇనుము, క్యాల్షియం వంటి సూక్ష్మధాతువులు పంటకు చేకూరుతాయి. నేలలో కరుగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతాయి.
- నీటి నిల్వ సామర్థ్యం పెంచుతాయి.
- వానపాముల ఉత్పత్తికి దోహదపడుతాయి.
- లెగ్యుమినేసి జాతికి చెందిన మొక్కలు కావడంతో వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుంది.
- నేల భౌతిక స్థితి మెరుగుపడి భూమి గుల్లగా మారి నేలలోకి నీరు ఇంకే గుణం పెరుగుతుంది.
- నేలలో సేంద్రియ పదార్థం వేయడంతో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- జీవ రసాయన చర్యలతో నేలలో సారం పెరగడమే కాక నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకుని ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది.
- నేలలో క్లిష్ట (లభ్యం కాని) రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోకి మారుస్తాయి.
- భూమిలో రసాయన ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి హరిత ఎరువులు ఉపయోగపడుతాయి.
- కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చు.
- భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది.
- సూక్ష్మపోషకాలను పంట మొక్కలకు అందేలా చేస్తాయి.

సాగులో మెళకువలు

- పంట కోయగానే నేలలో మిగిలిన తేమను సద్వినియోగం చేసుకుని పచ్చిరొట్ట ఎరువులు విత్తుకోవాలి.
- తేమ చాలని ప్రాంతాల్లో వేసవిలో దుక్కి దున్ని తొలకరి వర్షాలు పడగానే చల్లుకోవాలి.
- నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభదాయకం.
- రెండు పంటల మధ్య కాలవ్యవధిలో చల్లుకుని కలియ దున్నుకోవచ్చు.

ఎక్కువ పోషకాలు అందుతాయి



ప్రతి ఏటా పచ్చిరొట్ట ఎరువు సాగుపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గి, ఖర్చు పెరుగుతుంది. పచ్చిరొట్ట ఎరువును అందించే పైర్ల పెంపకం చాలా సులభమే. తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలను అందించవచ్చు. పచ్చిరొట్ట సాగులో జీలుగ, జనుము ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇవి తక్కువ సమయంలో ఎక్కువ పోషకాలు ఇస్తాయి. ఆకులలో ఎక్కువ నత్రజని శాతం కలిగి ఉంటాయి. రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గుతుంది.

– విజయ్‌కుమార్, ఏఓ, వడమాలపేట.

క్లుప్తంగా

ప్రోటోకాల్ రగడ



ప్రోటోకాల్ రగడకు కారణమైన శిలాఫ

శ్రీరంగరాజపురం: మండలంలోని మంగుంట గ్రామంలో చిత్తూరు ఎంపీ నిధులతో 28 లక్షల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి స్థానిక టీడీపీ నాయకులు శిలాఫలకం ఏర్పాటు చేశారు. వాటిని మంగళవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రారంభించారు. కానీ జనసేన, బీజేపీలకు సంబంధించిన ఇన్‌చార్జులను, నాయకులను ఆహ్వానించలేదు. ప్రోటోకాల్ ప్రకారం శిలాఫలకంపై జనసేన ఇన్‌చార్జి యుంగంధర్ పొన్న పేరు లేదు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ వినుతశ్రీ

గంగాధరనెల్లూరు: పోషణ పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. సీడీపీఓ వినుతశ్రీ మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యం కోసం సమతుల్య పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలతో కలిసి సీడీపీఓ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ అనురాధ, విద్యాశాఖ సీఆర్పీ, ఏఎన్‌ఎంలు మాధవి, కుమారి, కోకిల, అమరావతి, రమాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అందడం లేదని ఫిర్యాదు



రేషన్ బియ్యం అందడం లేదని ఫిర్యాదు చేస్తున్న బీసీ కాలనీ వాసులు

కార్వేటినగరం: రేషన్ బియ్యం కోసం పడిగాపులు పడక తప్పడం లేదని మంగళవారం బీసీ కాలనీవాసులు మండల తహశీల్దార్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ గత 5 నెలలుగా రేషన్ బియ్యం ఇవ్వడం లేదని, జీవనం దారుణంగా మారిందన్నారు. ప్రతి నెల ప్రభుత్వం అందించే నిత్యవసర సరుకులు కూడా మాకు దూరమైందన్నారు. ఎండీయూ వాహన డ్రైవర్‌ను ప్రశ్నిస్తే సిబ్బందితో పాటు కలసి దౌర్జన్యం చేస్తూ తిట్ల పురాణం అందుకుంటున్నాడని తహశీల్దార్‌కు వివరించారు. దీంతో స్పందించిన తహశీల్దార్ విచారణ చేసి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కనీస వేతనం ఇవ్వాలి



డాక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు

విజయపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశ వర్కర్లకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ విష్ణుప్రియకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత, నాయకులు సలీనా, భువన, మునిలక్ష్మి, లత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భజనలు



సీతారాముల ఆలయంలో భజనలు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని ఎగవూరు శ్రీసీతారాముల ఆలయంలో ఈ నెల 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రతిరోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రీసీతారామాంజనేయ భజన మండలి సభ్యులు పేర్కొన్నారు. అలాగే ఈనెల 14వ తేదీ సీతారాముల చిత్రపటంతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దారి సమస్య పరిష్కారం



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

తవణంపల్లె: మండలంలోని నీలంపల్లె దగ్గర పొలాలకు వెళ్లే దారిని తవణంపల్లె తహసీల్దార్ సుధాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దార్ సుధాకర్, మండల సర్వేయర్ మురళీకృష్ణ, వీఆర్‌ఓ ప్రకాష్, సచివాలయ సర్వేయర్లు షణ్ముగం, భార్గవి మత్స్యం రెవెన్యూ గ్రామంలోని సర్వేనంబరు 195లో దారిని సర్వే చేసి కొలతలు వేయించి పరిష్కరించారు.

గురుకులంలో ఎంపీ తనిఖీలు

గంగాధరనెల్లూరు: మండలంలోని డాక్టర్ అంబేడ్కర్ ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దమయంతి, నాయకులు శ్రీధర్ యాదవ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

గజ వాహనంపై కరకంఠేశ్వర స్వామి



గజ వాహనంపై స్వామి, అమ్మవార్లు

నగరి: పట్టణ పరిధిలోని శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లను గజ వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో ఊరేగింపుగా వచ్చిన స్వామికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

వెదురుకుప్పం: సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్యే థామస్ అన్నారు. మంగళవారం వెదురుకుప్పంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఐసీడీఎస్‌కు సంబంధించి పోస్టర్లను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే థామస్ ఆవిష్కరించారు.

ప్రతి కేంద్రంలో పోషణ్ పక్వాడా



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నగరి: పోషణ్ పక్వాడా ఈ నెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఉంటుందని నగరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ప్రతి అంగన్ వాడీ సెంటర్‌లో నిర్వహించాలని సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంపై అవగాహన కల్పించే రీతిలో అంగన్‌వాడీలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరి ఐసీడీఎస్ పరిధిలోని నగరి, నిండ్ర, విజయపురం మండలాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు వివిధ కార్యక్రమాల ద్వారా పౌష్టిహారంపై అవగాహన కల్పిస్తామన్నారు. సూపర్‌వైజర్లు ఎస్.శంకరమ్మ, టి.లక్ష్మి, బీపీసీ గోపీనాథ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాతా శిశు మరణాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: మండల పరిధిలోని గర్భవతులు పౌష్టికాహారం తీసుకుంటే మాతాశిశు మరణాలు తగ్గించవచ్చని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశాలకు, ఆరోగ్య సిబ్బందికి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశీల, మురళి సమావేశం ఏర్పాటు చేశారు. డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ గర్భిణులు పాలు, గుడ్లు, ఆకుకూరలు, కాయగాయాలు సహా అన్ని ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ప్రసవం ప్రభుత్వ ఆస్పత్రిలో చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత విపరీతంగా ఉన్నందున మజ్జిగ, పండ్ల రసం ఎక్కువగా తీసుకోవాలి. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు సహాయంతో వెళ్లాలని తెలిపారు. గర్భవతులు రక్త పరీక్షలు చేసుకున్న తరువాతనే నెలసరి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

అక్రమాలకు అడ్డా

విజయపురం: పేదవాడు గుడిసె వేసుకుంటే వెంటనే తొలగించే అధికారులు.. కళ్లముందు అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదు. మండల స్థాయి అధికారులు అక్రమార్కులతో చీకటి ఒప్పందాలు చేసుకోవడంతో ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం తప్పడం లేదు. విజయపురం అధికారులు పేదవాళ్లను బెదిరిస్తూ, ఉన్న వాడికి సలాం కొడుతున్నారన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.

అనేక అక్రమాలు

విజయపురం మండలం అక్రమ ఇసుక తరలింపు, గ్రావెల్, లేఅవుట్, అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రోజురోజుకూ అక్రమ నిర్మాణాలు పెరిగి పోతున్నా అడిగే నాథుడు లేడు. దీంతో అక్రమార్కులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. ప్రధాన రోడ్డుకు పక్కనే ఆక్రమిత స్థలంలో కోట్ల రూపాయలతో వ్యాపార సముదాయాలు నిర్మిస్తుంటే అధికారులు అటువైపు చూడడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.



సూరికాపురం మెయిన్ రోడ్డు పక్కన కాంప్లెక్స్

మామూళ్ల మత్తు

సూరికాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రధాన రోడ్డుకు పక్కనే కోట్ల విలువ చేసే కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేస్తుంటే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా నిర్మిస్తున్న ఈ నిర్మాణ పనులను అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మండల స్థాయి అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. దీనిపై ఎంపీడీఓ రాజేంద్రన్‌ను వివరణ కోరగా...గతంలో తనకు చెప్పారని, అయితే అనుమతి తీసుకొన్నారో.. లేదో తెలియడం లేదు. కార్యదర్శిని విచారించి, చర్యలు తీసుకొంటామని తెలిపారు.

పెట్రోల్ ధరలు తగ్గించాలి

పుత్తూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజల్ ధరలను తగ్గించాలని సీపీఎం నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నెత్తిన గ్యాస్ సిలిండర్లు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది తిరగకముందే ఇలా నిత్యావసర వస్తువుల ధరలను పెంచి పేద మధ్యతరగతి ప్రజల నడ్డి విరచడం అన్యాయం అన్నారు. పెంచిన ధరలను తగ్గించకపోతే దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఆశాలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలి



డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

పుత్తూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను జీఓల రూపంలో అమలు చేయాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా డేను పురస్కరించుకొని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు అన్ని మండలాల్లోని పీహెచ్‌సీలలోని మెడికల్ ఆఫీసర్లకు తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ వినతిపత్రాలు అందజేశారు. తిరుపతి జిల్లా ఆశా సంఘ అధ్యక్షురాలు హేమలత మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన విధంగా జీతాల పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ గుర్తింపు, 180 రోజుల మెటర్నిటీ సెలవులపై జీఓలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గొల్లపల్లి, ఆరేటమ్మకాలనీ పీహెచ్‌సీ డాక్టర్లు ప్రవీణ్, మధురిమలకు ఆశా వర్కర్లు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు మారెమ్మ, ధనలక్ష్మి, హరిత, లక్ష్మీదీప, నాగజ్యోతి, మనిషా, రాధా తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశాలు

నగరి: కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి రాజ్యసభలో ఆశాలకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీకి జీవో విడుదల చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందామరై డిమాండ్ చేశారు. మంగళవారం ఆశాడేను పురస్కరించుకొని బుగ్గఅగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌ను ఆశాలతోపాటు కలిసిన ఆమె తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ వినతిపత్రం అందించారు. ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రాట్యుటీ రూ.లక్ష యాభైవేలు, మెటర్నిటీ సెలవులు 180 రోజులు, 60 నుంచి 62 సంవత్సరాలకు వయోపరిమితి పెంపునకు సంబంధించిన జీవో విడుదల చేయాలన్నారు. దీనిపై మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ నాయకులు హంస, రూప, రాజేశ్వరి, విజయలక్ష్మి గీతాలక్ష్మి, పుష్ప, జయసుధ, మాణిక్యమ్మ, ఆశలు పాల్గొన్నారు.

బస్టాండు మేనేజర్‌కు హైబీపీ

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆర్టీసీ బస్‌స్టేషన్ మేనేజర్ రవీంద్ర హైబీపీకి లోనై అస్వస్థతకు గురైన ఘటన చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. వివరాలు..కొన్ని రోజులుగా బస్టాండ్‌లోని మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో దుర్వాసన వస్తున్నట్లు డీపీటీఓ జగదీష్‌కు ఫిర్యాదులు వస్తున్నాయి. మూడురోజుల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయించాలని బస్‌స్టేషన్ మేనేజర్ రవీంద్రను ఆదేశించారు. మళ్లీ దుర్గంధం వస్తుండడంతో మంగళవారం రవీంద్రపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయన అధిక రక్తపోటుకు గురై పడిపోయారు. హుటాహుటిన ఆర్టీసీ సిబ్బంది బస్టాండుకు సమీపంలోని ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు.

అండగా ఉంటాం..



రఘు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



రామచంద్రరాజు దంపతులను పరామర్శిస్తున్న మాజీ మంత్రులు

- మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్‌ఆర్ సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. పుత్తూరు మండల పరిధిలోని వేపగుంట గ్రామ వైఎస్‌ఆర్ సీపీ యువ నాయకుడు యువరాజ్ అలియాస్ అఖిల్ తండ్రి ఏఎస్‌ఐ రఘుకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మంగళవారం గ్రామానికి వెళ్లిన ఆమె రఘుకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే ఇటీవల స్థానిక ఎన్జీఓ కాలనీకి చెందిన వైఎస్‌ఆర్ సీపీ కార్యకర్త శివ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. వారి ఇంటికి వెళ్లిన ఆమె శివ చిత్ర పటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, మున్సిపాలిటీ నాయకులు, కన్వీనర్లు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నగరి: అయిన వాళ్లను పోగొట్టుకొని దుఃఖంలో ఉన్న కుటుంబాలను మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. పుదుపేట సీనియర్ నాయకులు బీటీఎం సుబ్రమణ్యం మొదలియార్ ఇటీవల మృతి చెందారు. మంగళవారం ఆయన స్వగృహానికి వెళ్లిన మాజీ మంత్రి ఆర్కే రోజా సుబ్రమణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం సంజీవనగర్‌లో తల్లిని కోల్పోయిన వైఎస్‌ఆర్ సీపీ నేతలు సురేష్, సంపత్ గృహానికి వెళ్లి వారిని పరామర్శించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు మోహన్ రాజ్, బీడీ భాస్కర్, మురుగ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రుల పరామర్శ

పుత్తూరు: పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్రరాజు దంపతులను మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, మాజీ మంత్రి ఆర్కే రోజా మంగళవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల రామచంద్రరాజు సతీమణి అనారోగ్యపాలై ఆసుపత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకొంటున్నారు. విషయం తెలుసుకొన్న మాజీ మంత్రులు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.





శివ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రోజా, బీటీఎం సుబ్రమణ్యం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి

స్కూటీ అదుపు తప్పి.. వ్యక్తికి గాయాలు



గాయపడిన సుబ్రమణ్యం

విజయపురం: మండలంలోని కేశవపురం వద్ద స్కూటర్ అదుపు తప్పి కింద పడి సుబ్రమణ్యం(32) గాయపడ్డాడు. జంబాడ ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రమణ్యం కేశవపురం మీదుగా కనకమ్మసత్రం వైపు వెళ్తుండగా కేబుల్ లైన్ కోసం తవ్విన మట్టిలో స్కూటీ జారి కింద పడింది. దీంతో తలకు, ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావంతో కొట్టుమిట్టడుతుండగా స్థానికులు 108 ద్వారా విజయపురం పీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి తిరుపతికి తరలించారు. అతనికి భార్య వళ్లెమ్మ, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.